శ్రీరస్తు శుభమస్తు

శ్రీ ఆది శంకరాచార్య విరచిత

శ్రీ జగన్నాథాష్టకమ్


- భావార్థముతో -



అవిఘ్నమస్తు



సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A.,
గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/



Kiron Type Institute

శ్రీ జగన్నాథాష్టకమ్ - భావార్థముతో.

01. కదాచిత్ కాళిందీ తటవిపిన సంగీత కరవో
ముదా భీరీ(గోపీ)నారీవదన కమలాస్వాద మధుపః।
రమా శంభు బ్రహ్మా ఽమరపతిగణేశాఽర్చితపదో
జగన్నాథస్వామీ నయన పథగామీ భవతుమే॥

అప్పుడప్పుడు కాళిందీ నది తీరంలో ఉన్న అడవులలో తన (వేణుగాన) సంగీతమును నింపువాడు, ఆనందంతో వికసించిన గోపికా స్త్రీల ముఖ పద్మములను ఆస్వాదిస్తూ తుమ్మెదవలె విహరించువాడు, రమా, శంభు, బ్రహ్మ, అమరపతి (ఇంద్రుడు) గణేశునిచే అర్చింపబడు పాదములు కలవాడు అయిన జగములన్నిటికి నాథుడైన జగన్నాథ స్వామి నా కనుల ప్రయాణములందు ఎల్లప్పుడు ఉండుము.

జగన్నాథస్వామీ ఒక్కొక్కసారి యమునాతీర వనాలలో మధురగానము చేస్తూ ఆనందంతో గోపికాముఖాలను చుంబించుచు వినోదించు చుండును. లక్ష్మి, శివుడు, బ్రహ్మ, ఇంద్రుడు, గణపతి మున్నగు దేవతలంతా జగన్నాథస్వామి పాదముల నర్చించు చుందురు. అట్టి జగన్నాథస్వామి నా కన్నులకు కనపడుగాక!

- - - - - -

02. భుజే సవ్యే వేణుం శిరశి శిఖిపింఛం కటితటే
దుకూలం నేత్రాంతే సహచరకటాక్షం విదధతే।
సదా శ్రీమ(ద్వృ)ద్బృందావనవసతిలీలాపరిచయో
జగన్నాథస్వామీ నయన పథగామీ భవతుమే॥

ఎడమచేతిలో వేణువును, శిరస్సున నెమలిపింఛమును, నడుముకు శ్రేష్ఠమైన వస్త్రములు ధరించి, తన క్రీగంటి చూపులతో తన సహచరులకు కటాక్షమును ఇచ్చువాడు, ఎల్లప్పుడూ శ్రీమంతమైన బృందావనంలో ఉంటూ తన లీలలను చూపువాడు అయిన జగన్నాథస్వామీ, నా కనుల ప్రయాణములందు ఎల్లప్పుడు ఉండుము.

ఎడమచేత్తో పిల్లనగ్రోవిని, తలపై పింఛమును, మొలపై పట్టుబట్టను, కడకన్నులలో సహచరులపై కటాక్షమును ధరించి, ప్రతిరోజూ మనోహరమైన బృందావనంలో విహారలీలలు చేసే ఆ జగన్నాధస్వామి నా కనులకు కనపడుగాక!

\- - - - - -

03. మహాంభోధేస్తీరే కనకరుచిరే నీలశిఖరే
వసన్ ప్రాసాదాంతః సహజబలభద్రేణ బలినా।
సుభద్రామధ్యస్థః సకలసురసేవావసరదో
జగన్నాధస్వామీ నయన పధగామీ భవతుమే॥

మహాసాగరము యొక్క తీరమందు ఉన్న బంగారు వర్ణం కలిగిన ఇసుక రేణువుల వద్ద ఉన్న నీలాచల శిఖరమందు ఉన్న రాజభవనంలో, అనుజుడైన - బలశాలి అయిన బలభద్రునితో తమ మధ్య సుభద్రతో కూడి, సకల దేవతలు సేవించే అవకాశం కోసం ఎదురుచూస్తూ ఉన్న జగన్నాథ స్వామీ, నా కనుల ప్రయాణములందు ఎల్లప్పుడు ఉండుము.

నల్లని శిఖరముగలిగి బంగారు కాంతితో మెరుస్తూ సముద్రతీరమున దివ్య భవనమున తోబుట్టువులైన సుభద్రా బలరాముల మధ్యనుండి సకలదేవతలకు సేవించుకునే అవకాశాన్నిస్తూ వెలసియున్న ఆ జగన్నాధ స్వామి నా కనులకు కనపడుగాక!

\- - - - - -

04. కృపాపారావారః సజలజలదశ్రేణిరుచిరో
రమావాణీరా(సో)మస్ఫురదమల
పద్మేక్షణ(పద్మోద్భవ)ముఖైః।
సురేంద్రైరారాధ్యః శ్రుతిగణశిఖాగీతచరితో
జగన్నాధస్వామీ నయన పధగామీ భవతుమే॥

కరుణ సముద్రమంత కలిగి, జలము నిండుగా ఉన్న నల్లమబ్బుల వంటి శోభ కలిగినవాడు - రమ (లక్ష్మీదేవి); వాణీ (సరస్వతీదేవి) లకు ఆనందము కలిగించువాడు - సురేంద్రునిచే ఆరాధింపబడువాడు - శృతులయందు (వేదములు) ఉన్న ఉన్నత గీతలచే (వాక్యబోధలు) కీర్తింపదగ్గ చరితము కలవాడు అయిన జగన్నాథ స్వామీ, నా కనుల ప్రయాణములందు ఎల్లప్పుడు ఉండుము.

దయాసముద్రుడు, నీటితో నిండిన మబ్బువలే మెరయువాడు, లక్ష్మి - సరస్వతి - చంద్ర - సూర్యాగ్నులు - బ్రహ్మ మున్నగు దేవతా శ్రేష్ఠులచేత పూజింపబడువాడు, సర్వ వేదములచే వర్ణింపబడిన చరిత్రకలవాడు, అట్టి జగన్నాథస్వామి నా కనులకు కనపడుగాక.

\- - - - - -

05. రథారూఢో గచ్ఛన్పధి(థి) మి(ళి)లితభూదేవపటలైః

స్తుతి ప్రాదుర్భావం ప్రతిపదముపాకరణ్య సదయః।

దయాసింధుర్బంధుః సకలజగతాం సింధుసుతయా

జగన్నాథస్వామీ నయన పథగామీ భవతుమే॥

రథమును ఎక్కి తిరుగుతూ, రహదారులలో కలిసిపోయి వ్యక్తమవుతున్న స్తుతులను అడుగడుగునా అప్పటికప్పుడు వింటూ, సాగరమంత దయ కలిగి, సకల జగత్తులయందు బంధువువలె, సముద్రము యొక్క పుత్రునివలె ఉన్న జగన్నాథ స్వామీ, నా కనులప్రయాణములందు ఎల్లప్పుడు ఉండుము.

దయాసింధువు, సకలలోకబంధువూ అయిన ఆ స్వామి లక్ష్మీదేవితో కూడి రథమునెక్కి వెళ్ళుచుండగా దారిలో అనేక బ్రాహ్మణులు అనేక రీతుల కొనియాడగా అతి శ్రద్ధతో ఆ స్తోత్రముల ప్రతిపదమునువిని వారి యందు ఎంతో దయ చూపునట్టి జగన్నాథస్వామి నాకు కనపడుగాక!

\- - - - - -

06. పరబ్రహ్మాపీడః కువలయతలో(దళో)త్ఫుల్లనయనో
నివాసీ నీలాద్రౌ నిహిత చరణోఽ నంతశిర(సి)సే।
రసానందో రాధాసరసవపురాలింగనసుఖో
జగన్నాథస్వామీ నయన పథగామీ భవతుమే॥

కుంచించిన పరబ్రహ్మ స్వరూపముతో, నీలికమల దళములవంటి వికసించిన నయనములు కలిగి, నీలాద్రి (నీలాచల) నివాసి, అనంతుడి శిరస్సుపై ఉంచిన పాదములతో, రసానందభరితురాలైన రాధయొక్క అందమైన శరీరముచే ఆనందముగా కౌగిలించుకొనబడి ఉన్న జగన్నాథ స్వామీ, నా కనుల ప్రయాణములందు ఎల్లప్పుడు ఉండుము.

కలువరేకువలే వికసించిన కన్నులుకలవాడు, నీలాద్రివాసి, అనంతుడు, సర్పరాజు శిరమున కాలూనినవాడు, రసానందస్వరూపుడు, రాధా శరీరాలింగన సుఖము నంది యున్నవాడు, అట్టి జగన్నాథస్వామి నా కన్నులకు కనిపించుగాక!

- - - - - -

07. నవైప్రార్థ్యం రాజ్యం న చ కనకతాం భోగవిభవం
నయాచేఽహం రమ్యాం నిఖిలజనకామ్యాం వరవధూమ్।
సదా కాలే కాలే ప్రమధ(థ)పతినా గీతచరితో
జగన్నాథస్వామీ నయన పథగామీ భవతుమే॥

రాజ్యములను, బంగారము, రత్నముల వంటి సంపదను యాచించను. అందరిచే వాంఛింపబడు అందమైన స్త్రీని అడుగను. అన్ని కాలముల యందు ప్రమథపతి (శివుడు) చే కీర్తింపబడు చరితము కలిగిన జగన్నాథస్వామీ, నా కనుల ప్రయాణములందు ఎల్లప్పుడు ఉండుము.

నాకు రాజ్యం వద్దు, బంగారం వద్దు, వైభవం వద్దు, అందరూ కోరుకునే అందమైన స్త్రీ కూడా వద్దు. సదా మహేశ్వరుడు పొగిడే దివ్య చరిత్రగల ఆ జగన్నాథ స్వామి కన్నుల కగుపడుటయే నాకు కావలసినది.

- - - - - -

08.హర త్వం సంసారం ద్రుతతరమసారం సురపతే
హర త్వం పాపానాం వితతిమపరాం యాదవపతే।
ఆహో దీనానాథం నిహితమచలం నిశ్చితపదం
జగన్నాథస్వామీ నయనపథగామీ భవతు మే॥

ఉపయోగం లేని ఈ భౌతికమైన సంసారమును నీవు త్వరగా హరింపుము ఓ సురపతి! అపరిమితముగా వ్యాపించిన నా పాపములను తొలగింపుము ఓ యాదవపతీ! ఆహా, దీనులకు అనాథులకు నీ ఈ చరణములు స్పష్టమైన నివాసము. (కనుక ఓ) జగన్నాథ స్వామీ, నా కనుల ప్రయాణములందు ఎల్లప్పుడు ఉండుము.

ఓ దేవాధిదేవా! అపారమైన నా ఈ సంసారమును హరింపుము. స్వామీ! ఈ సంసారమునకు కారణమైన నా పాపములను చెదర గొట్టుము. అయ్యో! దీనుడనై దిక్కులేక కొండవలే బండనై యున్న నన్ను సర్వదా రక్షించుటకై ఆ జగన్నాథస్వామి నా కన్నులకు కనపడుగాక!

\- - - - - -

09. జగన్నాథాష్టకం పుణ్యం యః పఠేత్ప్రయతః శుచి।
సర్వపాపవిశుద్ధాత్మా విష్ణులోకం స గచ్ఛతి॥

జగన్నాథాష్టకం అను పుణ్యవంతమైన దీనిని భక్తిగా శుచిగా పఠించువారు పాపములు తొలగింపబడిన శుద్ధమైన ఆత్మను కలిగి విష్ణులోకమునకు వెళ్ళెదరు.

ఇతి శ్రీ శంకరాచార్య విరచిత జగన్నాథాష్టకం సంపూర్ణం

\- - - - - -



(ఎక్కడైనా తప్పులు ఉంటే సహృదయంతో తెలియజేయవలసినదిగా మనవి.-944 044 9650, 994 994 1430)